సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ శ్రీనివాస్ రావు

నిజాంపేట్: సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ 191 కాలనీలో 16 సీసీ టీవీ కెమెరాలను శనివారం రాత్రి ప్రారంభించారు. కమ్యూనిటీ కెమెరాల్లో భాగంగా ఆలయంతో పాటు నిర్మానుష్య ప్రాంతంలో వీటిని ఏర్పాటు చేసినట్లు సీఐ జె.ఉపేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో మహా పూజ



పూజల్లో హనుమాన్ దీక్షాపరులు

కుత్బుల్లాపూర్: చింతల్ హెచ్ఎంటీ కాలనీలోని హనుమాన్ ఆలయంలో కోలేపాక కవిత, వెంకట్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం మహా పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురు స్వాముల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకంతో పాటు భజన పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



అన్నదానంలో భక్తులు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్‌లో పెద్దమ్మ తల్లి విగ్రహం, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం అనంతరం అన్నదానం చేపట్టారు. ఆదివారం ఉదయం 6 గంటలకు పెద్దమ్మ తల్లి విగ్రహం, 10 గంటలకు బొడ్రాయి ప్రతిష్ఠాపనాలు ఉంటాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఆలయంలో అన్నదానం



జగద్గిరిగుట్ట: చింతల్, శ్రీ సాయి కాలనీలోని అభయాంజనేయ స్వామి, పోచమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నదానాలు చేపట్టారు. ఉదయం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వన మహోత్సవం లక్ష్యం ఖరారు

- 2025- 26లో 63 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయం
- 13 పురపాలక సంఘాలు, 34 జీపీలతో సహా శాఖల వారీగా లక్ష్యాలు
- వర్షాలు ప్రారంభం కాగానే మొక్కలు నాటేలా కార్యాచరణ
- నర్సరీల్లో లక్ష్యాలకు తగినట్లుగా మొక్కల పెంపకం



సాక్షి,సిటీబ్యూరో: వనమహోత్సవానికి అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. వర్షాలు ముమ్మరం కాగానే వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను ఖరారు చేసిన అధికారులు, స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వాములను చేసేందుకు అవగాహన కార్యక్రమంతో పాటు తగిన కార్యాచరణ ప్రణాళికతో చర్యలు తీసుకుంటోంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా 34 గ్రామ పంచాయతీల్లో గుంతలు తీస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా మొక్కలు నాటేందుకు వీలుగా గుంతలను తీయిస్తున్నాయి.

పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా..

ప్రకృతి సమతుల్యత పర్యావరణ పరిరక్షణతోనే సాధ్యపడుతోంది. సమృద్ధిగా వర్షాలు కురవాలంటే సాధారణంగా అటవీ విస్తీర్ణం కనీసం 33 శాతం ఉండాలని అటవీశాఖ పేర్కొంటున్నప్పటికీ, జిల్లాలో మాత్రం ఆ పరిస్థితికి విరుద్ధంగా ఉంది. ఈ లోటును అధిగమించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వనమహోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటాలని నిర్ణయించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థతో పాటు వివిధ ప్రభుత్వశాఖలకు మొక్కలు నాటే లక్ష్యాలను అధికార యంత్రాంగం ఖరారు చేయటంతో ఆయా శాఖలు కసరత్తు చేస్తున్నాయి.

హరితహారం లక్ష్యం రూ.63 లక్షలు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాదిలో 63 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. శివారు 13 పురపాలక సంఘాల్లో వనమహోత్సవంలో భాగంగా బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు మేడ్చల్, తూంకుంట, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి మున్సిపాలిటీల్లో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 34 గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటనున్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో నిర్దేశించిన ప్రదేశాల్లో నాటేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు

జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో తూముకుంట, కండ్లకోయ, దూలపల్లిలోని 3 నర్సరీలు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో 34 గ్రామ పంచాయతీలతో సహా 13 పురపాలక సంఘాలలోని నర్సరీల్లో లక్ష్యానికి తగినట్లుగా మొక్కలు పెంచుతున్నారు. ఈ ఏడాది వనమహోత్సవంలో గతేడాది నాటిన మొక్కలతో పాటు టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదాం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందారం, సన్నజాజి, మల్లె నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పచ్చదనం, భూముల పరిరక్షణ

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో పచ్చదనాన్ని పెంచడంతో పాటు కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ, అసైన్డ్, అటవీ, చెరువు శిఖం భూముల పరిరక్షణ లక్ష్యంగా వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక ప్రాంతాలలో కూడా మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. సామూహిక వనాల పెంపకానికి స్థల సేకరణలో సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అర్బన్ పార్కులతో సహా పల్లె, పట్టణ ప్రాంతాల్లో ప్రకృతి వనాల లక్ష్యంగా వనమహోత్సవం విజయవంతం చేసేందుకు ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. రహదారుల పక్కన, పాఠశాలలు, చెరువుగట్లు, ప్రైవేటు రంగ సంస్థల కార్యాలయాల్లో వెంచర్లు, లే అవుట్లు, ప్రభుత్వ స్థలాలు, శ్మశానవాటికల్లో మొక్కలను విరివిగా నాటాల్సి ఉంది. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసేందుకు అధికార యంత్రాంగం పక్కా కార్యాచరణతో ముందుకెళ్తోంది.





ఘనంగా దశమ వార్షికోత్సవం



దేవతా మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు

రంగారెడ్డినగర్: అభయాంజనేయస్వామి సహిత శ్రీరాజరాజేశ్వరి సహిత నాగలింగేశ్వరస్వామి ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి అభిషేకం, 9 గంటలకు మంగళ వాయిద్యాలు, గోపూజ, విఘ్నేశ్వర పూజ, రక్షాబంధనం, పుణ్యాహవచనం, దేవతా ఆహ్వానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు యాగం అగ్నిప్రతిష్ఠ, అవాహిత దేవతా పూజ, మన్యుసూక్త సహిత ఆంజనేయ మూలమంత్ర హవనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ రవీందర్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలని పూజలు



నిజాంపేట్: 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలని కోరుతూ హిట్ టీవీ ఆధ్వర్యంలో హిల్ కౌంటీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహా మృత్యుంజయ యాగాన్ని శనివారం నిర్వహించారు. మాజీ మేయర్ కొలన్ నీలా, సీనియర్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శత్రు సేనలను కట్టడి చేసి, దేశాన్ని కాపాడిన భారత సైన్యానికి మనోధైర్యాన్ని అందించాలని కోరుకున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక హిల్ కౌంటీ నివాసితులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

జగద్గిరిగుట్ట: లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నాయకుడు సాయి కుమార్ పంతుల శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సైనికులు చిరంజీవులుగా ఉండాలని స్వామివారికి అర్చన చేయించామన్నారు. ఆలయ ఈఓ కృష్ణమాచార్యులు ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, సభ్యులు వేణు గౌడ్, బుచ్చిరెడ్డి కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ సర్కిల్ ప్రెసిడెంట్ శ్రావణ్, మల్లికార్జున్ రెడ్డి, చెన్నప్ప, ఆలయ పూజారి శేషు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీడీఐలో వినూత్న కార్యక్రమం



రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్-హైదరాబాద్‌లో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'యంగ్ మైండ్స్ ఎక్స్‌ప్లోర్ డిజైన్ హరిజన్స్ ఎట్ ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్' పేరిట శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.అందులో భాగంగా ప్రభా ఫౌండేషన్ నుంచి 35 మంది విద్యార్థులు, అయిదు మంది అధ్యాపకులతో కూడిన బృందానికి అతిథ్యం ఇచ్చింది. యువ ఆశావహులలో సహ కారం అభ్యాసాన్ని పెంపొందించడం, డిజైన్‌పై అవగాహనను ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎఫ్‌డీడీఐ ప్రతినిధి షైజీ మాట్లాడారు. అనంతరం పాదరక్షలు, ఫ్యాషన్, జీవనశైలి, ఉత్పత్తి రూపకల్పన సాధనాలు, సాంకేతికతను వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



దుండిగల్: గుర్తు తెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్‌లోని ఓఆర్ఆర్ సమీపంలోని ఏడు గుళ్ల వెనుక భాగంలో ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా అతని పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. అతని వివరాలు తెలియరాలేదని, ఎవరైనా సంబంధీకులు ఉంటే దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

'అందాల పోటీల నిర్వహణ సరికాదు'

కూకట్‌పల్లి: దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా హైదరాబాద్‌లో జరుగుతున్న అందాల పోటీలు విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ దేశానికి అండగా నిలబడాలని, సైనికులకు, వారి కుటుంబాలకు మేమున్నామన్న ధైర్యాన్ని కల్పించేలా చూడాలన్నారు. ఈ పోటీలు నిర్వహనపై శ్రద్ధ చూపకుండా, పరిస్థితులు అన్వేషించుకుని ముందుకు వెళ్లాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

చెత్తను తొలగించాలి

మోతీనగర్: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం పేర్కొన్నారు. లక్ష్మీనగర్ వద్ద ఉన్న శనివారం నాలాను పరిశీలించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలాకు ఇరువైపులా ఉన్నవారు చెత్తాచెదారాన్ని నాలాలో వేయకుండా ఇంటి వద్దకు వచ్చే ఆటో కార్మికులకు అందించాలని సూచించారు.

వ్యసనాలకు బానిసలై దొంగతనాలు

బెదిరించి సిగరెట్ బాక్సులు ఎత్తుకెళుతున్న నలుగురి అరెస్ట్

మియాపూర్: జైలుకు వెళ్లొచ్చినా వారి బుద్ధి మారలేదు.. మళ్లీ చోరీలకు పాల్పడుతున్న వారిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రూ.3లక్షల50వేలు విలువైన సిగరెట్ బాక్సులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. శనివారం మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్ కుమార్, సీఐ క్రాంతికుమార్, కొల్లూర్ సీఐ కె. రవీందర్, డీఐ రమేష్ నా యుడుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఒకరు కానిస్టేబుల్‌గా మరొకరు జైలు వార్డెన్‌గా పనిచేస్తూ వ్యసనాలకు బానిసై మరో ఇద్దరితో కలిసి క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని చెప్పి సిగరెట్ సప్లై చేస్తున్న వ్యక్తుల నుండి సిగరెట్ బాక్సులను ఎత్తుకెళ్లేవారు. ఒకసారి పట్టుపడి సస్పెండై జైలుకు వెళ్లి వచ్చాక కూడా మళ్లీ చోరీలకు పాల్పడుతున్న.. సికింద్రాబాద్ వారాసిగూడకు చెందిన గాయిని శ్రీకాంత్(36), కడప జిల్లా దువ్వూరుకు చెందిన చిదిరి అమర్‌నాథ్(41). మల్కాజిగిరి దయానంద్ నగర్‌కు చెందిన ఎండీ. ఇమ్రాన్‌ఖాన్(32), మలక్‌పేట్ మూసారంబాగ్ సిరిపురం కాలనీకి చెందిన వాసం శ్రీకాంత్(32) నలుగురు ముఠాగా ఏర్పడి దోపిడీలకు పాల్పడుతున్నారు. శ్రీకాంత్ కంది జైల్‌లో వార్డెన్‌గా పనిచేయగా, అమర్‌నాథ్ అంబర్‌పేట్‌లో ని ఏపీ యూనిట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శ్రీకాంత్, అమర్‌నాథ్ ఇమ్రాన్‌ఖాన్, శ్రీకాంత్‌లతో కలిసి ఐటీసీ సిగరెట్ కేంద్రాల నుండి బాక్సులను షాపులకు సప్లై చేస్తున్న వ్యక్తులను గుర్తించి క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని భయపెట్టి బాక్సులు తీసుకెళ్లేవారు. వీటిని సికింద్రాబాద్ దుకాణాల్లో రిటైల్‌గా అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు.

ఇలా పట్టుపడ్డారు..

గాజులరామారానికి చెందిన శ్రీహరి సిగరెట్ బాక్సులను దుకాణాలకు సప్లై చేస్తుంటారు. ఈనెల 7న సిగరెట్ బాక్సులను తీసుకుని ద్విచక్రవాహనంపై మాతృశ్రీనగర్ కాలనీకి వెళ్తుండగా సాధనా స్కూల్ సమీపంలో శ్రీకాంత్, అమర్‌నాథ్‌లు వాహనంపై వచ్చి శ్రీహరిని అడ్డుకున్నారు. పోలీసులమంటూ బాక్సుల్లో గంజాయి ఉందని తనిఖీ చేయాలని పరీక్ష కేంద్రానికి తీసుకువెళ్తున్నామంటూ రూ.లక్షా 50వేల సరుకును ఎత్తు కెళ్లారు.అదేవిధంగా గతేడాది నవంబర్ 28న కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తెల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల సమీపంలో మరొకరి నుండి కూడా ఇదే తరహాలో దోపిడికి పా ల్పడ్డారు. దీంతో బాధితుడు శ్రీహరి మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మియాపూర్, కొ ల్లూర్ పోలీసులు సంయుక్తంగా కేసు దర్యాప్తు ము మ్మరం చేశారు. సంఘటన స్థలంలో సిసి కెమెరాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా శ్రీకాంత్, అమర్‌నాథ్, ఇమ్రాన్‌ఖాన్, శ్రీకాంత్‌లను గుర్తించారు. వారిని మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దోపిడీకి పాల్పడింది తామేనని అంగీకరించారు. మియాపూర్, కొల్లూర్ పీఎస్‌లతో పాటు అల్వాల్, సైఫాబాద్ పీఎస్‌ల్లో వీరిపై కేసులు నమోదై ఉన్నాయి. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో వీరు పట్టుబడి జైలుకు కూడా వెళ్లివచ్చారు. ప్రస్తుతం అమర్‌నాథ్ సస్పెన్షన్‌లో ఉండగా శ్రీకాంత్ అనారోగ్య కారణాలతో సెలవు పెట్టాడు. ఈ కేసును ఛేదించిన కొల్లూర్ సిఐ రవీందర్, మియాపూర్ సిఐ క్రాంతి కుమార్, డిఐ రమేష్ నాయుడు, మియాపూర్ హెడ్ కానిస్టేబుల్ ప్రేమ్‌కుమార్, ఫుల్యానాయక్, కానిస్టేబుల్స్ చంద్రబోస్, పూర్ణచందర్,సాయి, జగన్‌లను మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్ అభినందించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడు అజ్మత్ అన్సారీ

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి బస్టాప్ సమీపంలో ఓ వ్యక్తి స్టూడెంట్స్‌కు గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. బీహార్‌కు చెందిన అజ్మత్ అన్సారీ (28) అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆపి తనిఖీ చేయగా 800 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

నాలాల్లో చెత్త తొలగింపు పనుల పరిశీలన

మోతీనగర్: డివిజన్ పరిధిలోని కబీర్‌నగర్‌లో చెత్తాచెదారం తొలగింపు పనులను మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ ఏఈ వర్షిణితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలగించిన చెత్తను వెంటనే తరలించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎర్ర స్వామి, నాయకులు రమేశ్ నాయుడు, సతీశ్ చారి, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్వయం సమృద్ధికి బాసటగా..

- శిక్షణ ఇస్తున్న ఎఫ్‌డీడీఐ-హెచ్
- తాజాగా గోనె టోపీలు.. చెప్పుల తయారీపై శిక్షణ
- ఇంటి వద్దే మహిళల స్వయం ఉత్పత్తులు



టోపీల తయారీపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ రాంబాబు

రాయదుర్గం: మహిళలకు శిక్షణ ఇవ్వడంలో ఎఫ్‌డీడీఐ-హెచ్ ముందుంటోంది. వారు స్వయం ఉపాధి అవకాశాలు పొందేలా తగిన తర్ఫీదు ఇస్తోంది. ఇప్పటికే కొన్ని శిక్షణ కార్యక్రమాలు సైతం నిర్వహించింది. తాజాగా మహిళలకు ఉచితంగానే శిక్షణ ఇచ్చేందుకు రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్-హైదరాబాద్ (ఎఫ్‌డీడీఐ-హెచ్) ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు సిద్ధమయ్యారు. మహిళలు ఇంటి వద్దే ఉంటూ వివిధ రకాల డిజైన్లతో కూడిన వస్తువులను తయారు చేసేలా వారికి శిక్షణ ఇవ్వాలని సంకల్పించారు. ఎఫ్‌డీడీఐ-హెచ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి ప్రత్యేక చొరవ, ఇతర ఫ్యాకల్టీ ప్రతినిధుల సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే జ్యూట్ బ్యాగులు, ఐటీ మహిళా ఉద్యోగులు ఉపయోగించేలా తయారు చేయడంపై మహిళలకు రెండు రాష్ట్రాల్లో శిక్షణ ఇచ్చారు. తాజాగా గోనె టోపీలు, చెప్పులు, అలాగే సాధారణ చెప్పులను తయారు చేయడంపై మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.

- శిక్షణ సందర్భంగా నేర్చుకున్న నైపుణ్యాలను బట్టి గంట నుంచి రెండు గంటల సమయంలోనే ఒక గోనె టోపీని తయారు చేస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాలలో వారు అధికంగా ఆసక్తి చూపే చెప్పులను తయారు చేయడంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు.

పది మంది మహిళలుంటే..



మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చి వారి కాళ్లపై వారు నిలబడేలా పలు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని తలపెట్టాం. జ్యూట్, ఇతర రకాల బ్యాగుల తయారీపై ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో ఉచిత శిక్షణ ఇచ్చాం. తాజాగా గోనె హ్యాట్, సాధారణ రకం చెప్పుల తయారీపై శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశాం. పదిమంది మహిళలు ఉంటే వారికి శిక్షణ ఇచ్చి తయారు చేసేలా చూస్తాం.

– డాక్టర్ రాంబాబు, ఫ్యాకల్టీ ఎఫ్‌డీడీఐ, హైదరాబాద్ రాయదుర్గం

ఓ వైపు దుమ్ము.. మరోవైపు మురుగు!

- మేడ్చల్‌లో జాతీయ రహదారిపై వాహనదారుల అవస్థలు
- రహదారి పక్కనే పారుతున్న మురుగు
- రోడ్డుపై నీరు పోయకపోవడంతో రేగుతున్న దుమ్ము





మేడ్చల్: అది దేశంలోని ఉత్తర భారత దేశం, దక్షిణ భారత దేశాన్ని కలిపే అతిపెద్ద జాతీయ రహదారి. తమిళనాడు కన్యాకుమారి నుంచి ప్రారంభమై జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ వరకు వెళ్లే 44వ జాతీయ రహదారి మేడ్చల్‌లో అభాసుపాలవుతుంది.

కనీస నిబంధనలు పాటించని కాంట్రాక్టర్

- మేడ్చల్ పట్టణ పరిధిలో కొంపల్లి నుంచి ఎల్లంపేట్ వరకు రహదారి పనులు జోరుగా సాగుతున్నాయి. పనుల్లో భాగంగా ఫ్లై ఓవర్ల నిర్మాణం, అండర్ పాస్‌ల నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులు పడుతూ.. లేస్తూ నిత్యం జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ కనీస నిబంధనలు పాటించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిత్యం వేల వాహనాలు

- 44వ జాతీయ రహదారి దేశంలో దక్షిణం నుంచి ప్రారంభమై ఉత్తరాన్ని కలిపే రోడ్డు. దేశంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సరుకులు, ప్రజా రవాణ చేసేందుకు నిత్యం వేల వాహనాలు రహదారిపై తిరుగుతున్నాయి. దీంతో 44వ జాతీయ రహదారిపై 24 గంటల వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాహనాల సంఖ్య అధికం కావడంతో నిర్మాణ రోడ్డుతో అన్ని ఇబ్బందులు ఎదురౌతున్నాయి.

రహదారి వెంటే మురుగు..

- మేడ్చల్ పట్టణ పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపుల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు ఉన్నాయి. నిర్మాణ సంస్థలు అడ్డగోలుగా రోడ్డు పక్కన తవ్వకాలు చేస్తుండటంతో అప్పటికే ఉన్న మురుగు కాల్వల పైపులైన్ పగిలిపోవడంతో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తున్నాయి.
- మేడ్చల్ బస్టాండ్, పోలీస్‌స్టేషన్, ఆర్టీసీ కాలనీ చౌరస్తా, రహదారి బంగ్లా సమీపంలో తదితర ప్రాంతాల్లో తరుచూ మురుగు నీటి పైపులైన్ పగిలి రహదారి వెంట పారుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.రహదారి వెంట ఉన్న కాలనీలలోకి మురుగు వెళ్లి నానా ఇబ్బందులు సృష్టిస్తున్నాయి.

దుర్వాసనతో ఇబ్బంది

- రహదారి వెంట మురుగు కారణంగా దుర్వాసనతో వాహనదారులు, పట్టణంలో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి వెంబడి మురుగు కిలోమీటర్ మేర ప్రవహిస్తుండటంతో ప్రధానంగా ద్విచక్రవాహదారులు ఓ వైపు దుర్వాసన, మరోవైపు రోడ్డుపై దుమ్ముతో అవస్థలు చూడాల్సి వస్తోంది.

అధికారుల మధ్య సమన్వయ లోపం..

- మున్సిపల్ అధికారులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, కాంట్రాక్టర్ మధ్య సమన్వయం లేకపోవడంతో వాహనదారులకు తరుచూ ఇబ్బందులు ఎదురౌతున్నాయి.

నిత్యం రేగుతున్న దుమ్ము

- రోడ్డుపై నిర్మాణ పనులు జోరుగా సాగుతుండటంతో నిర్మాణ పనులకు ఉపయోగించే మట్టి, సిమెంట్ తవ్వకాలు చేసే వాహనాలతో రహదారి వెంట మేడ్చల్ పట్టణ పరిధిలో నిత్యం దుమ్ము రేగుతూ వాహనదారుల కళ్లల్లో పడటంతో ఇబ్బందులు పడుతున్నారు.

నామమాత్రపు చర్యలు

- రోడ్డు పక్కన వ్యాపారాలు చేసే వ్యాపారులు, కొనుగోళ్ల కోసం వచ్చే వినియోగదారులకు అవస్థలు తప్పడం లేదు. కాంట్రాక్టర్ దుమ్ముపైకి లేవకుండా నిత్యం రెండు పూటలా రహదారిపై నీరు పోయాల్సి ఉండగా.. పట్టించుకోవడం లేదు. అక్కడక్కడ నామమాత్రంగా పోస్తున్నా.. ప్రజలకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.